సాక్షి
అనకాపల్లి
7
మంగళవారం । 25 । మార్చి । 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	మంగళ	బుధ
అనకాపల్లి	6.13	4.42
నర్సీపట్నం	6.16	4.40

న్యూస్‌రీల్

ఈ నెల 31 వరకే ధాన్యం సేకరణ


జేసీ జాహ్నవి

తుమ్మపాల: ఖరీఫ్ 2024–25 పంట కాలానికి సంబంధించి ధాన్యం ఈ నెల 31లోగా విక్రయించుకోవాలని జాయింట్ కలెక్టరు ఎం.జాహ్నవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 7,893 మంది రైతుల నుంచి రూ.58.147 కోట్ల విలువచేసే 25372.880 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 31 చివరి గడువుగా నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లాలోని రైతులందరూ తాము పండించిన ధాన్యాన్ని సత్వరమే సంబంధిత ధాన్యం కొనుకోలు కేంద్రాలను సంప్రదించి విక్రయించుకోవాలని ఆమె సూచించారు.

పరీక్ష కేంద్రాల ఆకస్మిక తనిఖీ

నాతవరం : మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను సోమవారం డీఈవో అప్పారావునాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. డి.యర్రవరం, నాతవరం పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్షలు జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. అనుమానం ఉన్న కొందరు విద్యార్థులను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. ఈ రెండు పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, లైటింగ్, ఫ్యాన్లు వంటి సదుపాయాలు పరిశీలించారు. పరీక్షలు ముగిసేంత వరకు విద్యార్థులకు తాగునీటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబుకు, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ రెండు పరీక్ష కేంద్రాలను స్క్వాడ్ సాయిశైలజతో పాటు మరో స్క్వాడ్ బృందం వేర్వేరుగా ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. డీఈవోతో పాటు మరో రెండు స్క్వాడ్ బృందాలు ఆకస్మిక తనిఖీలు చేసిన రెండు పరీక్ష కేంద్రాల్లో ఎవరూ పట్టుబడలేదు.

బాలల న్యాయమండలిలో సభ్యుల నియామకానికి దరఖాస్తులు

తుమ్మపాల : జిల్లాలోని బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయ మండలిలో సభ్యుల నియామకానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బాలల సంక్షేమ, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ జిల్లా పర్యవేక్షణ అధికారి వై. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. రక్షణ, ఆదరణ కరువై, నేరారోపణ ఎదుర్కొంటున్న పిల్లల కేసులను పరిష్కరించేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి ఈ నెల 22 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. దీని గురించి పూర్తి నోటిఫికేషన్, అర్హతల వివరాలు, దరఖాస్తు ఫారం https://wdcw.ap.gov.in అనే వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని, ఆసక్తి గల, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు డౌన్లోడ్ చేసుకుని ఏప్రిల్ 9వ తేదీ లోగా డైరెక్టర్, బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ, విజయవాడకు పంపవలసినదిగా కోరారు. మరింత సమాచారం కోసం జిల్లా పర్యవేక్షణ అధికారిని ఫోన్ నెం. 9030153369 ద్వారా సంప్రదించవచ్చునని తెలిపారు.

క్షయ రహిత గ్రామాలకు అవార్డులు


అవార్డులు అందుకున్న కార్యదర్శులు, ల్యాబ్ టెక్నీషియన్లు

మాకవరపాలెం: క్షయ రహిత గ్రామాలకు అవార్డులు లభించాయి. మండలంలోని బయ్యవరం, జి.గంగవరం, బి.ఎస్.పేట, జిడ్.గంగవరం గ్రామాలను ఇటీవల క్షయ రహిత పంచాయతీలుగా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ముక్త్ భారత్ కార్యక్రమంలో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఈ పంచాయతీల కార్యదర్శులు క్షయ జిల్లా అధికారుల నుంచి అవార్డులు అందుకున్నారు. మాకవరపాలెం పీహెచ్‌సీలో క్షయ విభాగం ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సుధీర్ కూడా అవార్డు అందుకున్నట్టు వైద్యాధికారి సీతారామలక్ష్మి తెలిపారు.

సాగర తీరంలో దంచికొట్టుడు


ఇరగదీసిన ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ ఆశుతోష్ శర్మ(66 నాటౌట్)


స్టేడియం నిండుగా..




యువతి కేరింత


ఢిల్లీ..బల్లేబల్లే..


చీర్ గర్ల్స్ హంగామా

- ఉత్కంఠ పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ విజయం
- చివరివరకు పోరాడిన లక్నో సూపర్ జెయింట్స్
- క్రికెట్ ఫ్యాన్స్‌కు ఫుల్ పండగ

విశాఖ స్పోర్ట్స్ : సిక్సులు, ఫోర్ల సునామీ.. బంతి బంతికి నరాలు తెగే ఉత్కంఠ.. చివరి వరకు మ్యాచ్ ఇరువైపులా దోబూచులాట.. క్రికెట్ అభిమానులకు ఇంకేం కావాలి. ఫుల్ పండగే. డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో సోమవారం జరిగిన ఐపీఎల్ తొలి మ్యాచ్ ఫ్యాన్స్‌కు మస్తు మజా ఇచ్చింది. తొలుత లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లు ఆధిపత్యం చూపించగా.. ఆ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు తామేం తక్కువ కాదన్నట్లుగా అద్భుత షాట్లతో అలరించారు. బ్యాటర్లు సిక్సులు, ఫోర్లు దంచికొట్టగా ఫ్యాన్స్ హోరు అంబరాన్ని తాకింది. అభిమానుల కేరింతలతో స్టేడియం హోరెత్తింది. **లక్నో సూపర్ జెయింట్స్ జట్టు 20 ఓవర్లకు 209/8 పరుగు చేయగా.. ఢిల్లీ క్యాపిటల్స్ 211/9 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.** ఆఖరి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్ అభిమానులకు ఫుల్ కిక్ ఇచ్చింది. ఈ మ్యాచ్‌ను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రత్యక్షంగా వీక్షించారు. ఢిల్లీ క్యాపిటల్స్ తన రెండో మ్యాచ్‌ను వైఎస్ఆర్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలోనే ఈనెల 30న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో తలపడనుంది.


కుల్దీప్‌తో అక్షర్ పటేల్


డ్రమ్‌రే డ్రమ్


విజయ కేతనం



ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు మద్దతు తెలుపుతూ ఫ్యాన్స్ సందడి


పాపాహోమ్ బాలలతో కలిసి మ్యాచ్ తిలకిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ


స్టేడియంలో కోలాహలం



‘గోవాడ’ క్రషింగ్‌కు మరో సమస్య


కాటాల వద్ద నిలిచిపోయిన చెరకు


డబ్బులివ్వకుండా కాంట్రాక్టర్ పరారయ్యాడని ఫ్యాక్టరీ ఎండీ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న కలాసీలు

- బిల్లు డబ్బులు తీసుకుని లారీలతో పరారైన ఒప్పంద కాంట్రాక్టర్
- లారీలు రాక కాటాల వద్దే నిలిచిపోయిన చెరకు
- క్రషింగ్‌కు చెరకు అందక ఇబ్బందులు
- తమకు లోడింగ్ డబ్బులు ఇవ్వకుండా పరారయ్యాడని కలాసీలు లబోదిబో
- ప్రత్యామ్నాయ ట్రాన్స్‌పోర్టుకు చర్యలు చేపట్టిన యాజమాన్యం

చోడవరం: కాటాల నుంచి చెరకు తరలించాల్సిన లారీలు రాకపోవడంతో ఎక్కడి చెరకు అక్కడే ఉండిపోయింది. చేతికందిన డబ్బులతో లారీల కాంట్రాక్టర్ చడీచప్పుడు లేకుండా మధ్యలోనే వదిలేసి వెళ్లిపోవడంతో గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి మరో సమస్య వచ్చి పడింది. కాటాల వద్ద చెరకు ఉండిపోయి క్రషింగ్‌కు కావలసిన సరకు సమయానికి అందని పరిస్థితి నెలకొంది. చెరకు కాటాల నుంచి సుగర్ ఫ్యాక్టరీకి లారీల్లో చెరకు చేరవేసేందుకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఏటా ఒప్పందం చేసుకుంటారు. ఈ ఏడాది కూడా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వ్యక్తికి కాంట్రాక్ట్ ఇచ్చారు. మొత్తం 19 కాటాల నుంచి 25 నుంచి 30 లారీల్లో కాంట్రాక్టర్ ఫ్యాక్టరీకి చెరకు తరలిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఫ్యాక్టరీ లారీల కాంట్రాక్టర్‌కు రెండు నెలలుగా బిల్లులు చెల్లించడంలో జాప్యం చేసింది. ఎట్టకేలకు శనివారం కాంట్రాక్టర్‌కు రూ.66 లక్షలు చెల్లించింది. ఈ పేమెంట్ తీసుకున్న కాంట్రాక్టర్ యాజమాన్యానికి చెప్పకుండా లారీలను నిలిపివేసి గుట్టుచప్పుడు కాకుండా వారి సొంత ఊరికి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయానికి కాటాల నుంచి చెరకు రాకపోవడంతో ఫీల్డు సిబ్బంది, వ్యవసాధికారులను యాజమాన్యం వాకబు చేయడంతో అసలు విషయం బయటపడింది. కాటాల వద్దకు లారీలు రాకపోవడంతో అక్కడ చెరకు లోడ్ చేసే కలాసీలు ఫ్యాక్టరీ వద్దకు వచ్చి మేనేజింగ్ డైరెక్టర్ సన్యాసినాయుడుతో సమావేశమయ్యారు. లారీల కాంట్రాక్టర్ తమకు రావలసిన లోడింగ్ డబ్బులు ఇవ్వకుండా లారీలను తీసుకొని వెళ్లిపోయాడని, తమకు న్యాయం చేయాలని వారు ఎండీకి విన్నవించుకున్నారు. క్రషింగ్ వేగంగా జరుగుతున్న సమయంలో సకాలంలో చెరకు ఫ్యాక్టరీకి రాకుండా కాటాల వద్దే ఉండిపోవడంతో క్రషింగ్‌కు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కాంట్రాక్టర్‌ను ఫోన్ చేసినా సమాధానం రాకపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని ఎండీ తెలిపారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

28న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

ఉక్కునగరం: ఇటీవల తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను ఈనెల 26వ తేదీన రీజనల్ లేబర్ కమిషనర్‌తో జరగనున్న చర్చల నాటికి విధుల్లోకి తీసుకోకపోతే ఈనెల 28న సమ్మె చేస్తామని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు నిర్ణయించాయి. సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఈ మేరకు తెలిపారు. ఇప్పటికే వెయ్యి మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారన్నారు. వీరిలో అత్యధికంగా నిర్వాసితులు, స్థానికులు ఉన్నారన్నారు. మరోవైపు 45 ఏళ్లు దాటిన వారికి వైద్య పరీక్షలకు పంపించి వారి పాసులు నిలిపివేయడం దుర్మార్గమన్నారు. ఉపాధి రక్షణ కోసం ఈ నెల 28న ఉదయం 6 నుంచి 29వ తేదీ ఉదయం 8 వరకు విధులు బహిష్కరించి ఆ రోజంతా అడ్మిన్ బిల్డింగ్ వద్ద నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

మండే ఎండల్లో కాసింత ఊరట

- జిల్లాలో పలుచోట్ల గాలి వాన
- నేలరాలిన మామిడి పంట
- అనకాపల్లిలో అత్యధికంగా 16.75 మి.మీ వర్షపాతం


చోడవరంలో ఈదురుగాలులకు నేలరాలిన మామిడి పంట


నీరు నిలిచిపోయిన అనకాపల్లి విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి

సాక్షి, అనకాపల్లి, చోడవరం, మునగపాక, అనకాపల్లి టౌన్: మండుతున్న ఎండలతో అల్లాడిపోతున్న జిల్లా ప్రజలకు వర్షం ఊరట కలిగించింది. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల వరకూ 37 డిగ్రీల సెల్సియస్‌తో ఎండ మండిపోగా.. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఈదురుగాలులతో వాతావరణమంతా చల్లబడిపోవడంతో జనం కాస్త సేదదీరారు. సుమారు గంట వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇదిలావుండగా ఈదురుగాలులు, భారీ వర్షానికి మామిడి రైతులకు తీవ్ర నష్టం కలిగింది. అసలే ఈ ఏడాది తేనెమంచు కారణంగా 30 శాతం కూడా మామిడి పంట పండలేదు. పండిన పంట ప్రస్తుతం కాయ దిగుబడి దశలో ఉంది. ఈ పరిస్థితుల్లో ఒక్కసారిగా కురిసిన అకాల వర్షానికి పంటకు తీవ్రనష్టం కలిగింది. ఈదురుగాలులకు పక్వానికి వచ్చిన మామిడి కాయ నేలరాలింది. దీంతో మామిడి రైతులు తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లాలో వర్షపాతం

మండలం	వర్షపాతం (మి.మీ.లలో)
అనకాపల్లి	6.75
నర్సీపట్నం	14.00
రోలుగుంట	9.75
సబ్బవరం	8.75
కె.కోటపాడు	8.5
చీడికాడ	4.75
పరవాడ	3.00
మాడుగుల	2.75
రావికమతం	1.75
బుచ్చెయ్యపేట	1.50
మాడుగుల	1.00
గొలుగొండ	0.50

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

మునగపాక మండలంలో పలుచోట్ల సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూలపేటలో నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. స్పందించిన ఏఈ గోపీకృష్ణ గృహ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి మంగళవారం విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈదురుగాలుల హడావుడి

అనకాపల్లి పట్టణంలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. అకస్మాత్తుగా కురిసిన వర్షంతో గ్రామాల నుంచి పట్టణానికి వివిధ పనులపై వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు గంటపాటు ఏకధాటిన వర్షం కురిసి విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు చేరడంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.


మునగపాక మండలం మూలపేటలో గాలులకు నేలకొలిగిన విద్యుత్ స్తంభం

పరీక్ష కేంద్రం వద్ద బైక్‌పై మైనర్ విద్యార్థి హల్‌చల్

- నలుగురు విద్యార్థినులు, ఒక టీచర్‌కు గాయాలు
- గాయాలతోనే పరీక్ష రాసిన విద్యార్థినులు
- మైనర్ విద్యార్థిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న మండల విద్యాశాఖాధికారి సింహాచలం

చోడవరం : ఒక మైనర్ విద్యార్థి మోటారుసైకిల్‌తో చేసిన హల్‌చల్ నలుగురు విద్యార్థులను, ఒక టీచర్‌ను గాయాల పాల్జేసింది. గోవాడ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రం వద్ద సోమవారం ఈ సంఘటన జరిగింది. మండలంలో గోవాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో పదోతరగతి గణితం పరీక్ష రాసేందుకు నర్సాపురం కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను తీసుకొని టీచర్ పరీక్ష కేంద్రానికి వచ్చారు. పరీక్ష కేంద్రంలోకి ఇంకా అనుమతించడానికి కొంత సమయం ఉండడంతో అంతా బయట నిలుచొని ఉన్నారు. ఇంతో దూరవిద్య ద్వారా పదో తరగతి పరీక్ష రాసేందుకు ఇదే పరీక్ష కేంద్రానికి చోడవరానికి చెందిన ఒక విద్యార్థి మోటారు సైకిల్‌పై వచ్చాడు. రోడ్డుపై మోటారు సైకిల్‌తో వేగంగా అటూ ఇటూ తిరుగుతూ హల్‌చల్ చేస్తుండగా ఒక్కసారిగా మోటారు సైకిల్ అదుపు తప్పింది. ఆ పక్కనే ఉన్న కస్తూర్బా పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు, వారితో ఉన్న మహిళా టీచర్‌ను మోటారు సైకిల్‌తో ఢీకొట్టాడు. ఈ ఘటనలో వారంతా గాయపడడంతో భయాందోళనతో అక్కడ ఉన్న తోటి విద్యార్థులు పరుగు తీశారు. గాయపడిన విద్యార్థినులను హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరీక్ష సమయం అవుతుండడంతో వెంటనే వారిని పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చారు. గాయాలతోనే ఆ విద్యార్థినులు ఎంతో బాధతో పరీక్ష రాశారు.

బాధిత విద్యార్థినులను మండల విద్యాశాఖాధికారి సింహాచలం పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఇదిలావుండగా ఈ ప్రమాదానికి కారణమైన మైనర్ విద్యార్థిని చోడవరం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. విద్యార్థుల భవిష్యత్ రీత్యా తదుపరి చర్యలపై అధికారులు సమీక్షిస్తున్నట్టు తెలిసింది.

విద్యుత్ లోడ్ రెన్యూవల్‌కు రాయితీ

- సర్‌చార్జీలు లేకుండా బిల్లులు చెల్లించవచ్చు
- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణారావు



నర్సీపట్నం: ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిలు ఏప్రిల్ 17వ తేదీలోగా చెల్లిస్తే సర్‌చార్జీలు ఉండవని ఏపీఈపీడీసీఎల్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణారావు తెలిపారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ ఆయా కార్యాలయాల అధికారులు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు సహకరించాలన్నారు. లోడ్ రెన్యూవల్ చేసుకునేందుకు వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. గృహ వినియోగదారులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి లోడ్ రెన్యూవల్ చేసుకుంటే 50 శాతం రాయితీ ఇస్తామన్నారు. ఈ అవకాశం జూన్ నెలాఖరు వరకు మాత్రమే ఉందని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు 315 దరఖాస్తులు వచ్చాయని, 194 కనెక్షన్లు మంజూరు చేశామని తెలిపారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల 121 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కొద్ది రోజుల్లో మంజూరు చేస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ఉక్కపోత ప్రారంభం కావడంతో ఏసీల వాడకమూ పెరిగిందని డిఈఈ తెలిపారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఏసీలు కొనుగోలు చేసేవారు, ఇప్పటి వరకు వాడకుండా పునఃప్రారంభించే వారు కొన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. గది లోపల సూర్యరశ్మి పడకుండా చూసుకోవాలని, ఏసీలోని ఫిల్టర్లను తరచూ శుభ్రం చేయాలని సూచించారు. బిగించేటప్పుడు కండెన్సేషన్ పైపుల్లో నీరు పోసి పరీక్షించాలన్నారు. గాలి వీచే ద్వారాలను శుభ్రం చేయాలన్నారు. తద్వారా విద్యుత్తు ఆదా అవుతుందన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగురాలి మౌనపోరాటం



మహారాణిపేట (విశాఖ): రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన నూక రత్నం స్వప్నప్రియ విశాఖ కలెక్టరేట్ వద్ద సోమవారం మౌన పోరాటానికి దిగింది. పెళ్లి పేరుతో విశాఖకు చెందిన యువకుడు తనను మోసగించాడని, న్యాయం చేయాలని విశాఖ పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చింది. విశాఖలోని ఓ హోటల్ పనిచేస్తున్న సమయంలో అదే హోటల్‌లో పనిచేస్తున్న పవన్‌కుమార్‌రెడ్డితో పరిచయం ఏర్పడిందని, ఆ పరిచయం ప్రేమగా మారిందని వివరించింది. ఓ వైపు పనిచేస్తూనే మరో వైపు డిగ్రీ చదివేదాన్నని, 2023లో పెళ్లి చేసుకుంటానని పవన్ చెప్పడంతో శారీరకంగా దగ్గరయ్యామని చెప్పింది. చదువు కూడా మాన్పించేశాడని, ప్రస్తుతం ఉద్యోగం చేయడం లేదని, దివ్యాంగురాలిని అన్న కారణంగా ఇప్పుడు పెళ్లి చేసుకోనని మోసం చేశాడని ఆవేదన చెందింది. పవన్‌తో ప్రేమ కారణంగా అటు కుటుంబ సభ్యులు పట్టించుకోవడం లేదని, తనకు న్యాయం చేయాలంటూ వినతిపత్రం ఇచ్చింది.

ముందస్తు జాగ్రత్తలతో క్షయ నివారణ

- అవగాహన ర్యాలీలో డీఎంహెచ్‌వో రవికుమార్



అవగాహన ర్యాలీ చేస్తున్న టీబీ కార్యాలయ సిబ్బంది

అనకాపల్లి టౌన్: ముందస్తు జాగ్రత్తలతో క్షయ నివారించవచ్చని డీఎంహెచ్‌వో పి. రవికుమార్ తెలిపారు. సోమవారం స్థానిక టీబీ కార్యాలయంలో టీబీ దినోత్సవం సందర్భంగా క్షయపై అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి పూట జ్వరం, ఆకలి మందగించడం, ఛాతీలో నొప్పి, దగ్గినప్పుడు రక్తం రావడం తదితర లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలో డాక్టరును సంప్రదించాలని సూచించారు. జిల్లా టీబీ అధికారి డాక్టర్ ఎంఎస్‌వీకే బాలాజీ, వైద్యులు నగేష్ గుప్తా, శ్రావణి, వెంకటేష్, ఎస్‌వీఎస్ వెంకటేశ్వర నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

గడువులోగా అర్జీలకు పరిష్కారం

- జాయింట్ కలెక్టరు జాహ్నవి
- పీజీఆర్ఎస్‌లో 372 అర్జీల నమోదు
- కలెక్టరేట్ వద్ద పలు సమస్యలపై వినతులు, నిరసనలు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ జాహ్నవి, డీఆర్వో సత్యనారాయణరావు

తుమ్మపాల: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో ప్రజలు అందజేసిన అర్జీలను గడువు లోపల పరిష్కరించాలని జాయింట్ కలెక్టరు ఎం జాహ్నవి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆమెతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, కేఆర్‌సీసీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి, గృహ నిర్మాణశాఖ పీడీ వై. శ్రీనివాస్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కారం అనంతరం అర్జీదారునితో మాట్లాడి పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. సమస్య పరిష్కారంపై అర్జీదారుకు స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ వారం మొత్తం 372 అర్జీలు రాగా, 238 అర్జీలు రెవెన్యూ శాఖ, పోలీస్, పంచాయతీ రాజ్, ఇతర శాఖల్లో నమోదయ్యాయి. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా భూసేకరణపై నిరసన

అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో నష్టపరిహారం టీడీఆర్ బాండ్లు రూపంలో కాకుండా చెక్కులు, బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలంటూ నిర్వాసితులు కలెక్టరేట్ గేటు వద్ద నిరసన చేపట్టారు. రోడ్డు విస్తరణలో భూములతో పాటు ఇళ్లు, షాపులు కోల్పోతున్నామని, కనీసం గ్రామసభలు పెట్టకుండా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని ఈ నెల 31న శంకుస్థాపనకు సిద్ధమవ్వడం దారుణమన్నారు. రోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారాలతో జీవిస్తున్న బాధితులకు ఎటువంటి హామీలు ఇవ్వలేదన్నారు. నష్టపరిహారం, ఉపాధి అవకాశాలు వంటి సమస్యల పరిష్కారంపై పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం ఇచ్చారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని కోరారు. రైతులు, నిరుపేదలైన బాధితులకు టీడీఆర్ బాండ్లు కాకుండా గ్రామసభల్లో ప్రజాభిప్రాయం మేరకు నగదు చెల్లింపులు చేయాలని కోరారు.



నష్టపరిహారంగా టీడీఆర్ బాండ్లు వద్దంటూ నిరసన చేస్తున్న అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ బాధితులు

విద్యుత్ మీటర్ల రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

విద్యుత్ మీటర్ల రీడర్లకు ఉద్యోగ భద్రతతోపాటు నెలవారీ జీతాలు అమలు చేయాలంటూ రాష్ట్ర విద్యుత్ మీటర్ రీడర్స్ కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సిబ్బంది నిరసన చేపట్టారు. విద్యుత్ శాఖ అధికారులు హామీలు అమలు చేయాలని, వేతనాలు అకౌంట్ ద్వారా చెల్లించాలని, 2019 నుంచి వేతనాలు పెంపు చేయలేదని, తక్షణమే ఆలోచన చేసి సమస్యలు పరిష్కారం చూపాలన్నారు. అర్హతను బట్టి షిఫ్ట్ ఆపరేటర్, వాచ్ అండ్ వార్డు, కంప్యూటర్ ఆపరేటర్స్, అటెండర్స్, వాచ్‌మెన్, డ్రైవర్లుగాను నియమించాలంటూ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పి.తులసీరావు, కార్యదర్శి బి.శ్రీనివాసరావు జాయింట్ కలెక్టర్‌కు వినతి అందించారు.



సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన చేస్తున్న విద్యుత్ మీటర్స్ రీడర్స్ ఉద్యోగులు



కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న దివ్యాంగులు

ష్యూరిటీ లేని రుణాలివ్వాలని దివ్యాంగుల డిమాండ్

మదర్ థెరిసా పాదుపు సేవా సంఘం ఆధ్వర్యంలో అనకాపల్లి మండలంలో పలు గ్రామాలకు చెందిన దివ్యాంగులు కలెక్టరేట్ వద్ద నిరసన చేసారు. దివ్యాంగుల జీవనోపాధి నిమిత్తం ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీ రుణాలను ష్యూరిటీ లేకుండా అందించాలని కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో బస్సు పాసులు పనిచేసేలా చూడాలన్నారు. కుటుంబంలో ఇద్దరు దివ్యాంగులు ఉన్నవారికి కూడా పింఛన్లు మంజూరు చేయాలన్నారు. ప్రతి దివ్యాంగుడికి 35 కేజీల బియ్యం అందించాలన్నారు. వివాహంతో సంబంధం లేకుండా సొంత ఇల్లు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో దివ్యాంగులు కార్యాలయం ఏర్పాటు చేయాలంటు అనేక సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. దివ్యాంగులు కసిరెడ్డి అర్జున, దూడ నూకరాజు, గోవింద, శ్రీనివాసరావు, కోటేశ్వర రావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

సర్వీసు ప్రకారం కనీస వేతనం ఇవ్వాలి

17 సంవత్సరాల సర్వీసును పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తిస్తూ, వైద్య మిత్రలకు డీపీవో కేడర్, ఆఫీస్ అసోసియేట్, టీమ్ లీడర్స్ సమాన అర్హత కలిగిన కేడర్, జిల్లా మేనేజర్లకు డీవైఈవో కేడర్ అమలు చేసి కనీస వేతనం ఇవ్వాల్సిందిగా ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బంది డిమాండ్ చేశారు. ఉద్యోగి చనిపోయిన కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగాలలో వెయిటేజ్ కల్పించాలని వినతి పత్రం అందించారు. ఆస్పత్రిలో సిబ్బందికి అంతర్గత ప్రమోషన్లు కల్పించాలన్నారు.



కలెక్టర్ కార్యాలయం గేటు బయట గండివానిపాలెం రైతులు

లో-వోల్టేజ్ కారణంగా రైతుల ఇక్కట్లు

అచ్యుతాపురం రూరల్: మండలంలో దోసూరు పంచాయతీ గండివానిపాలెంలో లో-వోల్టేజ్ కారణంగా బోర్లు సరిగా పనిచేయడం లేదని రైతులు కలెక్టర్‌కి విన్నవించుకున్నారు. బోర్లు నడిచే విధంగా విద్యుత్ సరఫరా అందజేసి రైతుల వ్యవసాయానికి ఉపయోగపడాలని కోరారు. పొలాల్లో బోర్లకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు.

డీఎల్‌పురం రైతులకు న్యాయం చేయాలి

నక్కపల్లి: మండలంలో డీఎల్‌పురంలో డీఫారం పట్టాలు కలిగిన రైతులకు న్యాయం చేయాలని పలువురు అఖిలపక్ష నాయకులు, రైతులు సోమవారం నర్సీపట్నం ఆర్డీవో వి.వి. రమణకు వినతి పత్రం ఇచ్చారు. నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అప్పలరాజు, రైతు నాయకుడు గింజాల రమణ తదితరులు ఆర్డీవోను కలిశారు. 193 నుంచి 199 సర్వే నెంబర్ల వరకు ఉన్న ప్రభుత్వ భూముల్లో 64 ఎకరాలను 1964లో ప్రభుత్వం పేదలకు డీఫారం పట్టాలు పంపిణీ చేసిందన్నారు. అప్పటి నుంచి ఈ భూములను రైతులే సాగు చేసుకుంటున్నారన్నారు. వీటిని ప్రభుత్వం ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరిస్తోందన్నారు. జిరాయితీ రైతులకు నష్టపరిహారం చెల్లించి డీఫారం రైతులకు పరిహారం ఇవ్వలేదన్నారు. పరిహారం చెల్లించకుండా పేదల భూముల్లో ఏపీఐఐసీ వారు దౌర్జన్యంగా రోడ్లు వేయిస్తున్నారన్నారు. అడ్డుకున్న రైతులను పోలీసుల ద్వారా బెదిరిస్తున్నారని ఆరోపించారు.

అన్ని గ్రామాల్లోను డీఫారం భూములకు నష్టపరిహారం చెల్లించి, డీఎల్‌పురంలో పైన పేర్కొన్న రైతులకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించే వరకు రోడ్డు పనులు నిలుపుదల చేయాలని, వారికి న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు.



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 30 అర్జీలు



అర్జీదారుల సమస్య వింటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 30 అర్జీలు వచ్చాయని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. 30 ఫిర్యాదుల్లో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర సమస్యలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్ఐ డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భూ రికార్డులు మార్చేసిన గొలుగొండ తహసీల్దార్

- చర్యలు తీసుకోవాలని గదబపాలెం గిరిజనుల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

నర్సీపట్నం: గిరిజనులు సాగులో ఉండగా, భూ రికార్డులను మార్చేసిన గొలుగొండ తహసీల్దారుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. తహసీల్దారు వైఖరిని నిరసిస్తూ గొలుగొండ మండలం పాతమల్లంపేట పంచాయతీ శివారు గదబపాలెంకు చెందిన ఆదివాసీలు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దారును విధుల నుంచి తొలగించాలంటూ నినాదాలు చేశారు. ఆర్డీవో వి.వి.రమణ లేకపోవడంతో ప్రజా పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించిన నర్సీపట్నం తహసీల్దారు రామారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.జనార్దన్ మాట్లాడుతూ పాత మల్లంపేట రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు 850లో 36 ఎకరాలకు సంబంధించి అమెరికాకు చెందిన ఎన్ఆర్ఐ దుగ్గిరాల బాలకృష్ణ సాగు అనుభవంలో ఉన్నాడని చూపిస్తూ ఫిబ్రవరి 22న తహసీల్దారు శ్రీనివాసరావు భూ రికార్డులను మార్చేశారన్నారు. 50 ఏళ్లుగా సాగులో ఉన్న గిరిజనులకు కాకుండా రూ.5 కోట్ల విలువైన భూమిని ఎన్ఆర్ఐకి ధారాదత్తం చేశారన్నారు. ఎప్పుడో భూమిని వదిలిపోయిన ఎన్ఆర్ఐకి ఎలా కట్టబెట్టారన్నారు. ఈ భూ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తహసీల్దారుపై చర్యలు తీసుకుని గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ ఆందోళనలో బీఎస్పీ నాయకులు బొట్టా నాగరాజు, గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

టీడీఆర్‌లకు బదులు నగదు జమ చేయాలి

మునగపాక : తమకు టీడీఆర్‌లు కాకుండా నేరుగా అకౌంట్‌లో నగదు జమ అయ్యేలా చూడాలని కోరుతూ జేసీ జాహ్నవికి పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులు స్పందనలో వినతి పత్రం అందజేశారు. రహదారి విస్తరణకు తామంతా సహకరిస్తామని, టీడీఆర్ బాండ్లను పరిహారం కింద ఇస్తామని చెప్పడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకు రహదారి విస్తరణలో భాగంగా గతంలో జరిగిన గ్రామసభల్లో తమకు పరిహారాన్ని బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తామంటూ చెప్పారని, నేడు టీడీఆర్ బాండ్లను ఇస్తామనడం సరికాదన్నారు. పరిహారం విషయంలో 2013 భూ సేకరణ చట్ట ప్రకారం న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ వినతి అందజేశారు. వినతి అందజేసిన వారిలో భీమరశెట్టి శ్రీనివాసరావు, అచ్చియ్యనాయుడు, రామచంద్రరావు, కర్రి అప్పారావు, ఎస్.బ్రహ్మాజీ, ఆడారి శ్రీరాములు, జగన్నాథరావు, కృష్ణ, ఆడారి శ్రీనివాసరావు ఉన్నారు.



జేసీ జాహ్నవికి వినతి పత్రం అందజేస్తున్న రహదారి విస్తరణ బాధితులు

క్రికెట్ బెట్టింగ్ మాయలో పడకండి

- అత్యాశకు పోయి అప్పులపాలు కావద్దు
- ఎస్పీ తుహిన్ సిన్హా



అనకాపల్లి: ఐపీఎల్, టీ 20 క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో అమాయక ప్రజలను మోసగించేందుకు క్రికెట్ బెట్టింగ్ ముఠాలు వల విసురుతున్నాయని, తక్కువ పెట్టుబడి పెట్టి, ఎక్కువ లాభాలు సాధించవచ్చుననే ఆశ చూపించి ఆర్థికంగా నాశనం చేస్తున్నాయని ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ యాప్స్ వల్ల త్వరగా డబ్బు సంపాదించవచ్చనే మాయలో పడి చాలా మంది నష్టపోతున్నారని, కొందరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇటువంటి క్రికెట్ బెట్టింగ్ ముఠాలను అణచివేసేందుకు ప్రజలు సహకరించాలని, సమాచారాన్ని స్థానిక పోలీసులకు కానీ, 100/112 నంబర్లకు గానీ అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. మొదటి దశలో చిన్న మొత్తంలో గెలిచేలా చేసి నమ్మకాన్ని పెంచుతారని, తర్వాత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహిస్తారని, ఓడిపోయాక డబ్బు తిరిగి పొందేందుకు మరింత పెట్టుబడి పెట్టాలని మభ్యపెడతారని, అప్పులు తీసుకునే స్థితికి వచ్చి, తీవ్ర ఆర్థిక నష్టాలకు గురై ఆత్మహత్యకు పాల్పడే పరిస్థితి వస్తుందన్నారు. నకిలీ అకౌంట్లు, నకిలీ యూపీఐ లావాదేవీలతో అసలు నిర్వాహకులు కనిపించరని, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను ఉపయోగించి ఆకర్షణీయమైన ప్రకటనలు చేస్తారన్నారు. ఇతరుల ఖాతాలను ఉపయోగించి డబ్బు మళ్లించడం చట్టరీత్యా నేరమన్నారు.

పుట్టెడు దుఃఖంతో టెన్త్ పరీక్ష

- అనారోగ్యంతో మరణించిన తండ్రి
- కుటుంబ సభ్యులు నచ్చచెప్పడంతో పరీక్ష రాసిన తనయుడు



పుట్టెడు దుఃఖంతో పదో తరగతి పరీక్ష రాస్తున్న గౌరీ శంకర్

దేవరాపల్లి: తండ్రి మరణించడంతో పుట్టెడు దుఃఖంలో తనయుడు పదో తరగతి పరీక్ష రాసిన విషాదకర ఘటన దేవరాపల్లి మోడల్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. మోడల్ కాలనీకి చెందిన రొంగలి సింహాచలం (42) క్యాన్సర్ బారినపడి కొంతకాలంగా ఇంటి దగ్గరే ఉంటూ చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి మృతి చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఇతనికి భార్య లక్ష్మితో పాటు పదో తరగతి చదువుతున్న పెద్ద కుమారుడు గౌరీశంకర్, ఏడో తరగతి చదువుతున్న మరో కుమారుడు గణేష్ ఉన్నారు. తెల్లవారితే పదో తరగతి రాయాల్సిన గౌరీశంకర్ రాత్రంతా తండ్రి పార్థివదేహం వద్ద విలపిస్తూ కూర్చున్నాడు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు ఒకపక్క సింహాచలం అంతిమ యాత్రకు ఏర్పాట్లు చేస్తూనే, గౌరీశంకర్ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని పరీక్ష రాయమని నచ్చచెప్పారు. దీంతో తండ్రి పార్థివ దేహం వద్ద కన్నీటి వీడ్కోలు పలికి.. గౌరీశంకర్ గుండెల్లో బాధను దిగమింగుతూ పరీక్షకు పయనమయ్యాడు. స్నేహితుడి సహకారంతో ద్విచక్ర వాహనంపై తెనుగుపూడి గురుకుల విద్యాలయానికి చేరుకొని గణితం పరీక్ష రాశాడు. పరీక్ష రాసి తిరిగి వచ్చేటప్పటికి తండ్రి అంత్యక్రియలు పూర్తయ్యాయి.

అనుభవం ఉన్న ఇంజినీర్లతో తాండవ గేట్ల మరమ్మతు పనులు

- ఇరిగేషన్ శాఖ ఈఈ బాలసూర్యం



డీఈలు, జేఈలకు సూచనలు చేస్తున్న ఇరిగేషన్ ఈఈ బాలసూర్యం

నాతవరం: తాండవ రిజర్వాయరు ప్రధాన గేట్ల లీకేజీల మరమ్మతు పనులను అనుభవం ఉన్న మెకానికల్ ఇంజినీర్లతో చేయిస్తామని నీటిపారుదల శాఖ ఈఈ బాలసూర్యం చెప్పారు. ఆయన సోమవారం తాండవ ప్రాజెక్టు ప్రధాన గేట్లు మరమ్మతు పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ప్రధాన గేట్ల మరమ్మతులకు అవసరమైన మెటీరియల్ గురువారం సాయంత్రానికి వస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో శివారు ఆయకట్టు భూములకు నీరు అందించాలంటే ఈ సమయంలో కాలువలో పూడికతీత పనులు చేయాలన్నారు. ఆయన వెంట ప్రాజెక్టు డీఈ అనురాధ, జేఈ శ్యామ్‌కుమార్, జేఈ ఉమాశ్రీ, సిబ్బంది ఉన్నారు.

160 లీటర్ల సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారా బ్యాగులు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు

పాయకరావుపేట: మండలంలో గజపతినగరం, పెదరాంభద్రపురం గ్రామాల్లో దాడులు నిర్వహించి 160 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. గజపతినగరం సముద్రతీర ప్రాంతంలో దాడులు నిర్వహించగా సారాతోపాటు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వీరితో పాటు ఒక ద్విచక్ర వాహనం, ఆటో, 80 కేజీల నల్ల బెల్లం, 20 కేజీల అమ్మోనియా స్వాధీనం చేసుకున్నామన్నారు. 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. పెదరాంభద్రపురం గ్రామానికి చెందిన నలుగురిని, తుని సూరవరం గ్రామానికి చెందిన ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

జైలుకెళ్లినా తీరు మారలేదు

- 12 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ ఇద్దరు నిందితులు



గంజాయితో పట్టుబడ్డ యువకులతో ఎస్ఐ ధనుంజయ్

కె.కోటపాడు: జైలుకెళ్లినా వారి తీరు మారలేదు. ఒకరు గంజాయి కేసులోనూ, మరొకరు దొంగతనం కేసులోనూ శిక్ష అనుభవించి ఈ నెలలోనే జైలు నుంచి విడుదలయ్యారు. మరలా పాత పంథాలోనే నేరాల బాట పట్టడంతో కటకటాల వెనక్కి వెళ్లారు. మండలంలో బత్తివానిపాలెం కూడలి వద్ద సోమవారం 12 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు పట్టుకున్నారు. వీరిద్దరి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఆర్.ధనుంజయ్ వివరాల ప్రకారం ... ఇక్కడ వాహనాలను తనిఖీ చేస్తుండగా, బ్యాగులతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు యువకుల వద్ద బ్యాగుల్లో 12 కిలోల గంజాయిని గుర్తించి అదుపులోనికి తీసుకున్నారు. వీరిది ఢిల్లీకి చెందిన శిబరాం ప్రధాన్, ఒడిశాకు చెందిన నందన్‌రాంగా గుర్తించారు. ఈ గంజాయిని ఒడిశాలోని జోలాపుట్ నుంచి బత్తివానిపాలెం కూడలి మీదుగా పెందుర్తి రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లే క్రమంలో పట్టుబడ్డారు. బరంపురం జైల్లో శిబరాం ప్రధాన్ గంజాయి కేసులోను, నందన్‌రాం దొంగతనం కేసులో శిక్ష అనుభవించి ఈ నెలలోనే విడుదలయ్యారు. అక్కడ జైల్లో ఏర్పడిన పరిచయంతో వీరిద్దరూ మరలా గంజాయి రవాణాకు పాల్పడుతూ పట్టుబడ్డారు. వీరిద్దరిపైన కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. గంజాయి విలువ రూ.60 వేలు ఉంటుందన్నారు.

వాకపల్లి మాజీ సర్పంచ్, శతాధిక వృద్ధురాలు మృతి



సింహాచలమ్మ(ఫైల్)

దేవరాపల్లి: వాకపల్లి మాజీ సర్పంచ్, శతాధిక వృద్ధురాలు సబ్బవరపు సింహాచలమ్మ(106) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆమెకు ఆరుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు కిషోర్ నాయుడు కొన్నేళ్ల క్రితం ఆకస్మికంగా మరణించారు. 1995లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేసి సర్పంచ్‌గా సింహాచలమ్మ గెలుపొందారు. ఈమె కుమార్తెల్లో ఒకరైన మతల దేముడమ్మ ముషిడిపల్లి సర్పంచ్‌గా ప్రస్తుతం పదవిలో కొనసాగుతున్నారు. ఈ శతాధిక వృద్ధురాలైన సింహాచలమ్మ అంతిమ యాత్ర కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రు నయనాల మధ్య సోమవారం జరిగాయి. ఆమె భౌతికకాయానికి మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సంతాపం వెలిబుచ్చారు.

ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలని నిరసన



కొవ్వొత్తులతో నిరసన చేపడుతున్న అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు

దేవరాపల్లి: ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు మంగళవారం నిరసన చేపట్టారు. ముందుగా రైవాడ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ మండల నాయకులు కాటపల్లి అప్పారావు, కార్లి సాయి సుందరరావు, పతివాడ నాగభూషణం మాట్లాడారు. కుల గణన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేయాలన్నారు. రాజీవ్ రంజాన్ మిశ్రా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక తప్పుల తడకగా ఉందని విమర్శించారు. వర్గీకరణ విషయంలో కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలని డిమాండ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేసి అవమానించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. తక్షణమే దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. సంఘ మండల నాయకులు సబ్బవరపు మాలిబాబు, మచ్చ రామారావు, కన్నాబత్తుల రాజు, మచ్చ మహేష్, తాడి అప్పారావు, కదారి రాజు, రొప్పలరాజు, సబ్బవరపు కొండలరావు, సంతోష్, చంద్రశేఖర్, రొప్పల వెంకటరమణ పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులెప్పుడో..

- 9 నెలలుగా పలువురు ఎదురుచూపులు
- కార్డులు లేక సంక్షేమ పథకాలకు దూరం
- సవరణలకు అవకాశం లేక ఇబ్బందులు



తెల్లరేషన్ కార్డులు(ఫైల్)

అనకాపల్లి టౌన్: కూటమి ప్రభుత్వం పేదల జీవితాలతో చెలగాటమాడుతోంది. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటుతున్నా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం లేదు. దాంతో పట్టణంలో అనేక మంది వీటి కోసం ఎదురు చూస్తున్నారు. ఈ కార్డులు లేక అనేక మంది సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. అర్హులైన వారందరికీ కొత్త కార్డులు జారీని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అర్హులకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, దీనిపై కసరత్తు జరుగుతుందని, ప్రతిపాదించిన డిజైన్లు పరిశీలనలో ఉన్నాయని, త్వరలోనే కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పలుమార్లు ప్రకటిస్తున్నారే తప్పా ఆచరణలోకి వచ్చే సూచనలు కనిపించడంలేదు. దీంతో కొత్తగా పెళ్లిళ్లు అయిన జంటలు, అధికారుల తప్పిదాలతో కార్డులు పోయినవారు కొత్త కార్డులు వస్తాయని తొమ్మిది నెలలుగా ఎదురు చూస్తున్నారు. కొత్త కార్డులకు మరలా కొత్త డిజైన్లు పరిశీలించిన తర్వాత లేత పసుపు రంగుతో రూపొందించిన కార్డుపై రాష్ట్ర అధికారిక చిహ్నాన్ని ముద్రించిన నమూనాను సివిల్ సప్లయిస్ అధికారులు ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదించారు. ప్రతిపాదనలు పంపించి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన రావడం లేదు.

ప్రతినెలా బియ్యం, పంచదారే..

పట్టణంలో 21,275 రేషన్ కార్డులకు 63,272 మంది యూనిట్ దారులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఉచిత బియ్యంతో పాటు జొన్నలు, రాగులు, పంచదార వంటి నిత్యావసర వస్తువులన్నీ ఇస్తామని ఊదరగొట్టింది. దీంతో లబ్ధిదారులందరూ ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తుండడంతో కార్డుదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో అధిక ధరలు వెచ్చించి పప్పులు కొనుగోలు చేస్తున్నారు


తహసీల్దారు కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ కార్యాలయం దుస్థితి

పింఛన్ ఇవ్వడం లేదు



ఒంటరిగా జీవిస్తున్నాను. ఏ పథకానికైనా రేషన్ కార్డు అడుగుతున్నారు. కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తారని తొమ్మిది నెలలుగా ఎదురు చూస్తున్నా. కార్డు లేక వృద్ధాప్య పింఛన్ ఇవ్వడం లేదు. రేషన్ ఇవ్వక రైస్ బయట కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది.

– బి. భాగ్యలక్ష్మి, అనకాపల్లి

ప్రభుత్వ మార్గదర్శకాలు రాలేదు



నూతన కార్డుల కోసం ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదల అవలేదు. కార్డులు కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులు స్వీకరించాలన్నా సంబంధిత యాప్ ఓపెన్ అవడం లేదు. లీలా శేషాకుమారి, సీఎస్‌డీటీ, అనకాపల్లి

రైతులకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: ల్యాండ్ పూలింగ్‌లో భూములు సేకరించిన రైతులకు నిబంధన ప్రకారం అభివృద్ధి చేసిన వుడా ప్లాట్లను వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శంకరరావు, మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం వారు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో కూండ్రం, కుంచంగి, రొంగలివానిపాలెం, వెటజంగాలపాలెం. సీతానగరం, మామిడిపాలెం, కొండుపాలెం, పాపయ్య సంతపాలెం, కోడూరు రెవెన్యూ గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతుల నుంచి భూములు సేకరించి నాలుగేళ్లు దాటినా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా తాత్సారం చేయడం దారుణమన్నారు. దీనిపై ప్రజా ప్రయోజనార్థం బలవంతంగా ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు సమీకరించవద్దని హైకోర్టులో పిటిషన్ వేశామన్నారు. జీడి, మామిడి తోటలను తొలగించడం వల్ల రూ.60 వేల నుంచి రూ.2 లక్షల వరకూ ఒక్కొక్క రైతుకు ప్రతి సంవత్సరం నష్టం వాటిల్లుతోందన్నారు. ఆ నష్టాన్ని పూడ్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉందన్నారు. తక్షణమే ప్లాట్లును రైతులకు రిజిస్ట్రేషన్ చేయాలని, రాజధాని అమరావతి రైతులు మాదిరిగా ప్రతి రైతు కుటుంబానికి ఏటా కౌలు చెల్లించాలని, నేటివరకూ నష్టపోయిన పంటలకు పరిహారం వడ్డీతో సహా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు అల్లు రాజు, బొప్పే ఉమామహేశ్వరరావు, కాళ్ల తేలయ్య బాబు, కె.ఈశ్వరరావు, జి.సుభాషిణి, చలపతి, బుగిడి నూకఅప్పారావు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సత్తు కార్మికులకు ఇళ్ల స్థలాలివ్వాలి

అనకాపల్లి: అల్యూమినియం (సత్తు) కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని అనకాపల్లి అల్యూమినియం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి బుద్ధ వీరభద్రరావు కోరారు. సోమవారం స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆర్చి వద్ద సంఘం వన సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడీమేడ్ వస్తువులు వచ్చిన తర్వాత అల్యూమినియం కంపెనీలో కార్మికులకు పని లేకుండా పోయిందని వాపోయారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కొండూరు వీరాచారి, సభ్యులు ప్రేరాజు, కె. శ్రీను, కొండూరు గిరిబాబు, పెంటకోట శ్రీనివాస్, కోన లక్ష్మణ్, ఈగల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన


స్టాల్‌లో కూరగాయలు

కశింకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను సోమవారం ప్రదర్శించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాల్‌లో కూరగాయలు, బెల్లం అమ్మకాలు నిర్వహించారు. మండల ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం నిర్వాహకురాలు కూండ్రపు అరుణ ఆధ్వర్యంలో కలెక్టర్ విజయ కృష్ణన్ సూచనలతో ఏర్పాటు చేసిన స్టాల్‌లో ప్రకృతి సిద్ధంగా పండిన వివిధ రకాల కూరగాయలతో పాటు ప్రకృతి వ్యవసాయ సాగుకు వినియోగించే ద్రావణాలు, ఎరువులు ప్రదర్శించారు. వీటిని స్థానికులు ఆసక్తిగా పరిశీలించి, కూరగాయలను కొనుగోలు చేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది

అనకాపల్లి టౌన్: ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ సిబ్బందిని ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సి. గోవింద్ కోరారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో వైద్య సేవ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 8,411 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,370
మొదటి రకం	3,680	4,100
రెండో రకం	3,150	3,780
మూడోరకం	2,910	3,270

అనకాపల్లి సినిమాలు

రాజా :	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్-1:	టుక్‌టుక్
సత్యనారాయణ స్క్రీన్-2:	యుగానికి ఒక్కడు
పర్తిసాయి	: కోర్ట్
షిర్డీసాయి	: పెళ్లికాని ప్రసాద్
వెంకటేశ్వర(ఉదయం)	: షణ్ముక
వెంకటేశ్వర(మ్యాట్నీ, 1,2 షోలు):	న్యూ పోలీస్ స్టోరీ
శ్రీసత్య	: సలార్
రామచంద్ర	: ఛావా

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-05 యూనిట్లు, బీ పాజిటివ్-13 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 382 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 349 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

హిజ్రా దీపు కుటుంబానికి అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్


దీపు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న భరత్‌కుమార్, పార్టీ శ్రేణులు, ట్రాన్స్‌జెండర్లు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పెదబోయిగూడెం వీధిలో ఇటీవల హత్యకు గురైన ట్రాన్స్‌జెండర్ మైపాలి దిలీప్ శివశంకర్(దీపు) కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సోమవారం రాత్రి పరామర్శించారు. అంతకుముందు దీపు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందన్నారు. దీపు కుటుంబానికి కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. ట్రాన్స్‌జెండర్లకు దివ్యాంగుల కోటాలో ఉపాధి కల్పించాలన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ట్రాన్స్‌జెండర్లకు సంక్షేమ పథకాలు అందించేవారని, కూటమి పాలనలో వాటిని తక్షణమే అందజేయాలని కోరారు. హత్యకు కారణమైన నిందితుడికి తక్షణమే శిక్షణపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


కోలా సూర్యనారాయణను పరామర్శిస్తున్న మలసాల భరత్‌కుమార్

పట్టణంలోని ఏఎంసీ కాలనీలో ట్రాన్స్‌జెండర్ సంఘం సభ్యుల పరిస్థితిని అడిగి తెలుసుకుని సంఘీభావం వ్యక్తం చేశారు. 80వ వార్డు పార్టీ ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-2 వేగి త్రినాథ్, పార్టీ నాయకులు మైపాలి నూకరాజు, నాగేష్, జ్ఞానదీప్, పెంటకోట శ్రీనివాసరావు, మారిశెట్టి శ్రీను, కాండ్రేగుల రాము పాల్గొన్నారు.

సూర్యనారాయణకు పరామర్శ

స్థానిక ఉడ్‌పేట వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోలా సూర్యనారాయణ ఫిబ్రవరిలో విశాఖ నుంచి అనకాపల్లి బైక్‌పై వస్తుండగా మండలంలో సిరసపల్లి గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యారు. ఆయన్ను వైఎస్సార్‌సీపీ నియోజవకర్గ సమన్వకర్త మలసాల భరత్‌కుమార్ సోమవారం పరామర్శించారు. క్షతగాత్రుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.


మోటార్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డిమాండ్


అనకాపల్లి: మోటార్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ శంకరరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రవాణా రంగ కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో కీలకంగా ఉన్న మోటార్ రంగ కార్మికుల సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందన్నారు. వేలకోట్ల రూపాయలు ఆదాయాలు వస్తున్నా, మోటార్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లకు మాత్రం భద్రత లేకుండా పోయిందన్నారు. భారత న్యాయ సంహిత చట్టం వల్ల ప్రమాదాలకు డ్రైవర్‌నే బాధ్యుడిని చేస్తూ కఠిన శిక్షలు విధిస్తున్నారని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్లు లేవని, ఎక్కడికక్కడ గుంతల రోడ్లతో ప్రయాణాలు జరుగుతున్నాయని వాపోయారు. రోడ్లు, వెడల్పు లేకపోవడం వల్ల వాహనాల రద్దీ పెరగడం, ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించకపోవడం వల్ల నిరంతరం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డీజిల్, వాహనాల కొనుగోలుపై సెస్ విధించి మోటార్ డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం రూ. 200 కోట్లు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో డ్రైవర్లు జీవితాలు కోల్పోతున్నారని, తీవ్ర గాయాలతో మంచాన్ని పడితే వారి కుటుంబాన్ని ఆదుకునే నాథుడే లేడన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఆటోలు, వాహనాలపై భారీ జరిమానాలు విధిస్తుందని, గత ప్రభుత్వం ఆటో కార్మికులకి ఆర్థిక సాయం అందించేదని, నేడు కూటమి ప్రభుత్వం ఎటువంటి సహాయం అందించడం లేదన్నారు. ఆర్టీఏ పనులు ప్రైవేట్ వారికి అప్పగించడం వల్ల డ్రైవర్లు దోపిడీ గురవుతున్నారని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పరమేశ్వరరావు, అద్దె బస్సు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.పి. నాయుడు, పలక సత్తిబాబు, శ్రీనివాసరావు, శంకరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సూరిశెట్టి బాబునాయుడు, కార్యదర్శి చింత శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

క్షయ పట్ల అవగాహన తప్పనిసరి


క్షయ నివారణకు ప్రమాణం చేస్తున్న బాలికలు


తాళ్లపాలెం గురుకులంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు

కశింకోట: క్షయ పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని వెల్ఫేర్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యల గురించి క్షుణ్ణంగా అవగాహన కలిగించారు. ప్రిన్సిపాల్ జి. గ్రేస్ మాట్లాడుతూ క్షయపై సంపూర్ణ అవగాహనతో మాత్రమే దాన్ని ఎదుర్కోవడం సాధ్యమవుతుందన్నారు. క్షయపై అవగాహన కలిగిస్తూ బాలికలు ర్యాలీ నిర్వహించారు. క్షయ నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయినులు, ఆరోగ్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాద పథకానికి నగరంలోని శివాజీపాలేనికి చెందిన దువ్వి అప్పారావు సోమవారం రూ.లక్ష 116 విరాళమిచ్చారు. సంబంధిత విరాళాన్ని చెక్ రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేష వస్త్రంను అధికారులు అందజేశారు.

బినామీ మస్తర్లు ప్రోత్సహిస్తే భారీ జరిమానా

డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమా దేవి


ప్రజా వేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి


సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి


హాజరైన ఉపాధి సిబ్బంది

కశింకోట: జాతీయ ఉపాధి హామీ పథకంలో బినామీ మస్తర్లు ప్రోత్సహించిన వారికి భారీ జరిమానా విధించి వసూలు చేస్తామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్. పూర్ణిమా దేవి హెచ్చరించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.17 కోట్లతో నిర్వహించిన పనులకు మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 27 పంచాయతీల స్థాయిలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇ.చౌడువాడ, సుందరయ్యపేట, అచ్చెర్ల గ్రామాల్లో ఎక్కువగా బినామీ మస్తర్లుతో అవకతవకలు జరిగినట్లు గుర్తించామన్నారు. ఒకరికి బదులు మరొకరు పనులు చేశారని, వీటిని ప్రోత్సహించిన వారిపై చర్యలు చేపడతామన్నారు. మస్తర్లు ఆలస్యంగా వచ్చిన కూలీలకు సంబంధించి ఎన్ఎంఎంఎస్‌లో వేస్తారన్నారు. జాబ్ కార్డుదారులకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. సామాజిక తనిఖీలో జిల్లా రిసోర్స్ పర్సన్లు క్షేత్రస్థాయికి వెళ్లి పారదర్శకంగా వాస్తవాలను పరిశీలించి నివేదిస్తారని, దాన్ని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అవకతవకలు నిర్ధారణ అయితే శిక్ష విధిస్తామన్నారు. రైతులందరికీ పండ్ల తోటలు పెంపకానికి ఉపాధి పథకంలో అవకాశం కల్పిస్తామన్నారు. మొక్కల నాటడంలో చూపుతున్న శ్రద్ధ వాటి సంరక్షణపై చూపడం లేదన్నారు. దీనివల్ల ఎక్కువ శాతం మేర ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. మండలంలో 4,550 పండ్ల తోటల మొక్కలను ఉపాధి పథకంలో వేశామన్నారు. వాటిలో 30 శాతం వరకు మొక్కలు చనిపోతున్న పరిస్థితులు ఉంటున్నాయన్నారు. ఏటా నవంబర్‌లో గ్రామ సభలు నిర్వహించి ఉపాధి పనుల నిర్వహణకు ప్రణాళికను రూపొందిస్తామన్నారు.

ప్రతి శుక్రవారం రోజ్‌గార్ దివస్

ప్రతి శుక్రవారం రోజ్‌గార్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించి ఆయా గ్రామాల్లో వారం రోజుల్లో చేపట్టే ఉపాధి పనులు, గ్రూపులు నిర్వహించనున్నాయనే విషయాన్ని కూలీలు, గ్రామ పెద్దలకు తప్పనిసరిగా తెలియజేయాలని పీడీ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఉపాధి పనుల అవకతవకలను పీడీ దృష్టికి సామాజిక తనిఖీ సిబ్బంది తీసుకు వచ్చారు. వీటిపై పంచాయతీల వారీగా ఫీల్డు అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందిని వివరాలను తెలుసుకొని సామాజిక తనిఖీ నిర్వహించారు. ఉపాధి పనుల్లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ కూండ్రపు రామునాయుడు, జనసేన నాయకుడు దొడ్డి నాగేశ్వరరావు, టీడీపీ నాయకుడు నైనంశెట్టి రమణారావు తదితరులు డిమాండ్ చేశారు. వీటిపై చర్యలు చేపడతామని పీడీ బదులిచ్చారు. కశింకోటలో ముందుకు వచ్చే కూలీలకు పని కల్పించాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాడి నాగరాజు కోరారు. ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు కూలి పెంచాలని, తండ్రి అనారోగ్యం బారిన పడితే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు వేరొకరికి పని చేసే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి, ఏపీడీ జె. మణికుమార్, ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఏపీవోలు శివ, ఎం. శ్రీనివాసరావు, ఎస్ఆర్పీ నాగరాజు పాల్గొన్నారు.

ఉత్తమ టీబీ యూనిట్ వైద్యాధికారిగా కనకప్పారావు


జిల్లా అధికారుల నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ కనకప్పారావు

పరవాడ: అచ్యుతాపురం టీబీయూనిట్ క్షయ నివారణాధికారిగా వ్యవహరిస్తున్న వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కనకప్పారావుకు ఉత్తమ టీబీ యూనిట్ వైద్యాధికారి అవార్డు లభించింది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా సభ్యుడు డాక్టర్ నగేష్ గుప్తా, డాక్టర్ బాలాజీ చేతుల మీదుగా సోమవారం ఆయన ఈ అవార్డును అందుకున్నారు. అవార్డును అందుకున్న కనకప్పారావుకు వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఈదురు గాలులతో వర్షం


కాపుశెట్టివానిపాలెంలో పైకప్పు రేకులు ఎగిరిపోయి తడిసిపోయిన గృహ సామగ్రి

రెండిళ్ల పైకప్పు రేకులు ఎగిరి సామగ్రి ధ్వంసం


కశింకోటలో కురుస్తున్న వర్షం

తుమ్మపాల: మండలంలో సోమవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా గాలులు వీచడంతో కాపుశెట్టివానిపాలెంలో కరణం రమణ, కరణం నాగమణికి చెందిన ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. గృహాల్లో విద్యుత్ పరికరాలతోపాటు సామగ్రి ధ్వంసమైంది. 20కి పైగా ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. దీంతో రోడ్డున పడ్డ వారికి తక్షణ సహాయంగా చెరో రూ.5 వేల చొప్పున సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ అందజేశారు. రేబాకలో కొత్తపల్లి లీలావతికి చెందిన ఇడ్లీ దుకాణం పూర్తిగా నేలమట్టమైంది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడి వైర్లు తెగిపడ్డాయి. చెట్లు నేలకొరిగాయి. అర్ధరాత్రి వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలులకు చెల్లాచెదురైన సామగ్రితో పాటు సరఫరా లేకపోవడంతో అనేక గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కశింకోట: మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో చిన్నపాటి వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రోడ్డు పక్కన ఫ్లెక్సీలు చినిగిపోయి కిందకి వాలాయి. స్వల్పంగా కురిసిన వర్షంతో రోడ్లు తడిచాయి.

యూకలిప్టస్ తోటలో అగ్నిప్రమాదం

- ఐదెకరాల్లో రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం


మంటలను ఆర్పుతున్న ఎన్టీపీసీ అగ్నిమాపక సిబ్బంది

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు కొండవానిపాలెం సమీపంలో యూకలిప్టస్ తోటలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. 5 ఎకరాల్లో నాటిన యూకలిప్టస్ తోట కాలి బూడిదైంది. ఫలితంగా రైతులకు సుమారు రూ.8 లక్షల మేర ఆస్తినష్టం సంభవించినట్లు అంచనా. గ్రామానికి చెందిన సారిపల్లి నేస్తాలు, అరిజిల్లి మసేను, కొండ ముత్యాలు, కొండ తాతారావు తదితర రైతులు మూడేళ్ల క్రితం ఐదెకరాల విస్తీర్ణంలో యూకలిప్టస్ తోటలు వేశారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు యూకలిప్టస్ తోటకు నిప్పు పెట్టడడంతో, కాలిబూడిదైంది. అగ్నిప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు ఎన్టీపీసీ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. హుటాహుటిన ప్రమాద స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశఋూరు. అగ్ని ప్రమాద సమాచారాన్ని పరవాడ రెవెన్యూ అధికారులకు అందించినట్లు నాయుడుపాలెం మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి తెలిపారు.